

ప్రాణం తీసిన అతి వేగం

- పాదచారులను ఢీకొన్న ద్విచక్రవాహనదారుడు
- ఒకరి మృతి... మరొకరికి తీవ్ర గాయాలు
- కంచరపాలెం వద్ద జాతీయ రహదారిపై సంఘటన - వివరాలు 6లో




త్రినాథరావు మృతదేహం

సీఎం రాక రేపు

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన

- అనంతరం భోగాపురం పయనం...
- విమానాశ్రయం పనులపై సమీక్ష
- అక్కడ నుంచి ఏపీ మెడ్‌టెక్‌జోన్‌కు రాక
- కొత్త భవనాల ప్రారంభం
- విమానాశ్రయంలో అధికారులతో సమావేశం
- సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి అనిత ఆదేశం





మెడ్‌టెక్ జోన్‌లో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి అనిత. చిత్రంలో కలెక్టర్, సీపీ, జీవీఎంసీ కమిషనర్ ఉన్నారు

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి చేరుకుంటారు. అక్కడ పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలిస్తారు. దార్లపూడి నుంచి 12 గంటలకు బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం వెళతారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతర్జాతీయ విమానాశ్రయం పనులపై సమీక్షిస్తారు. అక్కడి నుంచి 1.50 గంటలకు బయలుదేరి ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు చేరుకుంటారు. 2.30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సీఐఐ వర్చువల్ సమావేశంలో పాల్గొంటారు. రెండు కొత్త భవనాలను ప్రారంభిస్తారు. అక్కడి సిబ్బందితో ముచ్చటిస్తారు. సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో సాయంత్రం ఆరు గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 6.10 గంటలకు విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

హోం మంత్రి మెడ్‌టెక్ జోన్ సందర్శన

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఈ నెల 11న ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనకు వస్తున్నందున పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులతో కలిసి ఆమె ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను మంగళవారం సాయంత్రం సందర్శించారు. అక్కడ కొందరు అధికారులు నిర్లిప్తంగా ఉండడం గమనించి వారిని హెచ్చరించారు. ఇది సీఎం కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 11వ తేదీ మధ్యాహ్నం 1.45 గంటలకు సీఎం మెడ్‌టెక్ జోన్‌కు చేరుకుంటారన్నారు. 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు సీఐఐ ఆధ్వర్యంలో జరిగే జాతీయ మండలి

... మిగతా 6వ పేజీలో

అర్ధరాత్రి సీపీ పర్యటన

- ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న వారికి స్వయంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు
- నంబర్ ప్లేట్లు లేనివాటిపై కేసులు
- మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు



మహారాణిపేట పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పలుప్రాంతాల్లో పర్యటించారు. అర్ధరాత్రివేళ నగరంలో పరిస్థితి ఎలా ఉంటుంది, పోలీసుల గస్తీ పరిస్థితి ఏమిటని ప్రత్యక్షంగా పరిశీలించారు. డాబాగార్డెన్స్, అల్లిపురం, కొబ్బరితోట, చావులమదుం, రైల్వే స్టేషన్, సరస్వతీ పార్కు ప్రాంతాల్లో తిరిగారు. ఆ సమయంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న కొందరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ద్విచక్ర వాహనాలతో తిరుగుతున్నవారిని ఆపి స్వయంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్టు తేలిన వ్యక్తిపై కేసు నమోదుచేయాలని ఆదేశించారు. రోడ్లపై తిరుగుతున్న హిజ్రాలను అదుపులోకి తీసకున్నారు. అర్ధరాత్రి వేళ కూడా ఓవర్‌లోడ్‌తో ప్రయాణికులను తీసుకువెళుతున్న ఆటోను ఆపి కేసు నమోదుచేశారు. నంబర్‌ప్లేట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదుచేశారు. అనంతరం మహరాణిపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీడీ బుక్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వివరాలు, విధులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి గస్తీ వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. సీఐ, ఎస్‌ఐలు ఎవరూ లేకపోవడంతో అక్కడున్న ట్రాఫిక్ ఎస్‌ఐ, ఇతర సిబ్బందిని ప్రశ్నించారు. అర్ధరాత్రి సమయంలో సీపీ స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేయడంతో పోలీసు అధికారులతోపాటు సిబ్బందిలో టెన్షన్ మొదలైంది.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ

టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్‌గా సాయికాంత్‌వర్మ

వైసీపీకి వీర విధేయునిగా ముద్ర

- 'హయగ్రీవ' భూముల్లో నిర్మాణాలకు అనుమతులు, టీడీఆర్‌ల జారీ, దసపల్లా హిల్స్ మాస్టర్ ప్లాన్ రోడ్డుకు నోటిఫికేషన్ సహా అనేక నిర్ణయాలు వివాదాస్పదం
- అందుకే స్థానచలనం
- ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు బాధ్యతలు



సీఎం సాయికాంత్‌వర్మ

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు బదిలీ అయ్యింది. ఆయన్ను ప్రభుత్వం ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్‌కు జీవీఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించాలని పేర్కొంటూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

గత ఏడాది ఏప్రిల్ 15న జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీఎం సాయికాంత్‌వర్మ వైసీపీ నేతలకు వీర విధేయునిగా పనిచేశారనే విమర్శలు ఉన్నాయి. వివాదాస్పదమైన 'హయగ్రీవ' భూముల్లో నిర్మాణాలకు గత కమిషనర్లు అనుమతి ఇవ్వకుండా ప్లాన్‌ను పలుమార్లు వెనక్కి పంపించేశారు. కానీ సాయికాంత్‌వర్మ మాత్రం హైకోర్టులో జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకున్నానని చెప్పి ప్లాన్‌ను అప్రూవ్ చేసేయడం చర్చనీయాంశమైంది. అలాగే రుషికొండలో శ్రీరామ్ ప్రాపర్టీస్‌కు ఎదురుగా వైసీపీ నేత విజయసాయిరెడ్డి కుమార్తె విల్లాలు నిర్మిస్తున్న ఐకానికా ప్రాజెక్టుకు ప్లాన్ జారీచేయడంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇంకా బక్కన్నపాలెంలో దశాబ్దం కిందట నిర్మించిన రోడ్డులో తమ భూమి కొంత పోయిందంటూ ఒక వ్యక్తి టీడీఆర్ కోసం దరఖాస్తు చేస్తే, ఎలాంటి అభ్యంతరం చెప్పకుండానే ఆగమేఘాల మీద రూ.208 కోట్లు విలువైన టీడీఆర్‌ను జారీచేసేశారు. తర్వాత అదే భూమికి మరో రూ.60 కోట్లు విలువైన టీడీఆర్ జారీచేసేందుకు సాయికాంత్‌వర్మ సిద్ధమవ్వగా విపక్షాలు అభ్యంతరం చెప్పడంతో వెనకడుగువేశారు. పెదజాలారిపేట గ్రామం ఉన్న భూమి దసపల్లా రాణీ వారసులకు చెందినదని పేర్కొంటూ ఆ భూమిపై టీడీఆర్ కొట్టేసేందుకు వైసీపీ నేతలు పథకం రచిస్తే..దాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సాయికాంత్‌వర్మ తన వంతు సహకారం అందించారనే ఆరోపణలు ఉన్నాయి. టీడీఆర్ జారీ చేసేందుకు వీలుగా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో గ్రామాన్ని సర్వే చేయించారు. విషయం బయటకు పొక్కి విపక్షాలు ఆందోళనకు దిగడంతో టీడీఆర్ జారీ ప్రక్రియ ఆగిపోంది. బిలాల్ కాలనీ మురికివాడ ఉన్న భూమి కూడా ప్రైవేటుదేనంటూ దానికి కూడా టీడీఆర్ తీసుకునేందుకు వైసీపీ నేతలు యత్నిస్తే వారికి అనుకూలంగా వ్యవహరించేందుకు సాయికాంత్‌వర్మ సిద్ధపడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. వెంకటపతిరాజు నగర్‌కు వైసీపీ నేత ఒకరు వెనకుండి టీడీఆర్ పొందేందుకు యత్నిస్తే సాయికాంత్‌వర్మ అడ్డుచెప్పకుండా కొమ్ముకాశారనే విమర్శలు ఉన్నాయి.

దసపల్లా హిల్స్‌లో సర్క్యూట్‌హౌస్ జంక్షన్ నుంచి నౌరోజీరోడ్డు జంక్షన్‌కు వంద అడుగులు మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ కమిషనర్ హోదాలో సాయికాంత్‌వర్మ నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, విపక్షాలు అడ్డుపడడంతో టీడీఆర్ జారీ ప్రక్రియ ఆగిపోయింది. అలాకాకుండా ... మిగతా 6వ పేజీలో

2, 3 రోజుల్లో

డాక్‌యార్డు వంతెన మూసివేత

- తొమ్మిది నెలల పాటు మరమ్మతులు
- ప్రత్యామ్నాయ మార్గం గుండా ప్రజలు రాకపోకలు సాగించాలని సూచిక బోర్డులు ఏర్పాటుచేసిన పోర్టు



సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన

మల్కాపురం, జూలై 9: పారిశ్రామిక ప్రాంతాన్ని నగరానికి అనుసంధానం చేసే డాక్‌యార్డు సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంతెనను పోర్టు అధికారులు రెండు, మూడు రోజుల్లో మూసివేయనున్నారు. వంతెనను మూసివేస్తున్నామని, ప్రజలందరూ ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు వెళుతున్న మార్గంలో రాకపోకలు సాగించాలంటూ పలుచోట్ల బోర్డులను ఏర్పాటుచేశారు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలకు బ్రేక్ వేసిన పోర్టు యజమాన్యం, ఇప్పుడు మరమ్మతుల కోసం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, అంబులెన్స్‌ల రాకపోకలను కూడా నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పోలీస్ శాఖకు, జిల్లా అధికారులకు, వివిధ పరిశ్రమల యజమానులకు లేఖలను పంపినట్టు తెలిసింది. వంతెన మూసివేసి తొమ్మిది నెలల పాటు మరమ్మతులు చేపట్టనున్నారు. అవి పూర్తయ్యేంత వరకూ ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలకు, వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం వంతెన పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలోనే అధికారులంతా సమావేశమై మూసివేత నిర్ణయం తీసుకున్నారు.

ఇలా రాకపోకలు సాగించాలి..

సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంతెన మూసివేత నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంత వాసులు నగరంలోకి వెళ్లేందుకు డాక్‌యార్డు ఎదురుగా ఉన్న గోడౌన్స్ బీపీసీఎల్, హెచ్‌పీ పెట్రో పార్కు మీదుగా షీలానగర్ టోల్ గేటు రూట్‌కు చేరుకుని, అక్కడి నుంచి కాన్వెంట్ జంక్షన్ వైపు వెళ్లేందుకు ఉన్న మరో వంతెన మీదుగా నగరంలోకి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే నగరం నుంచి పారిశ్రామిక ప్రాంతానికి వచ్చేవారు కాన్వెంట్ జంక్షన్ సమీపంలో ఉన్న వంతెన పైనుంచి డాక్‌యార్డు టోల్ గేటు సమీపం వరకు వచ్చి..అక్కడి నుంచి అదే వంతెనపై ఉన్న రెండో మార్గంగుండా డాక్‌యార్డు గోడౌన్స్ మీదుగా సింధియా, మల్కాపురం, గాజువాక చేరుకోవచ్చు. ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించేందుకు అదనంగా ఐదారు ... మిగతా 6వ పేజీలో

టీడీపీ ప్రజా ప్రతినిధులకు సత్కారం



ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన వారిని మంగళవారం జిల్లా కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావును, ఎంపీ ఎం.శ్రీభరత్‌ను సత్కరిస్తున్న పార్టీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులు - వివరాలు I పేజీలో



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌తో చర్చిస్తున్న కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు. పక్కన ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు

రైల్వే పనులపై కేంద్ర మంత్రి ఆరా

- విశాఖ, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి డీఆర్‌ఎం కార్యాలయానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- పెండింగ్ ప్రాజెక్టు పూర్తికి సహకారం అందిస్తామని హామీ

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు వాల్తేరు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులతో కలిసి ఆయన మంగళవారం సాయంత్రం డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లారు. డివిజన్‌లో జరుగుతున్న పనుల గురించి డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులకు సంబంధించిన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, స్టేషన్ల ఆధునికీకరణ వంటి వివరాలను డీఆర్‌ఎం వివరించారు. మంత్రి రామ్మోహన్‌నాయుడు అమృత్ స్టేషన్ల పనులు, రైళ్ల స్టాపేజీలు, విస్తరణ పనులు, ప్రయాణికులకు మరింత మెరుగైన కనెక్టివిటీ, ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులు వంటి అంశాలపై ప్రశ్నించి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. పెండింగ్ పనుల పూర్తికి సహకారం అందిస్తామని, రైల్వేస్టేషన్ల విస్తరణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

త్యాగాలు కార్మికులేనా?, మరి డైరెక్టర్లు చేయరా??

- జీతాలు, అలవెన్సులూ వదులుకోవాలన్న స్టీల్‌ప్లాంటు యాజమాన్యం పిలుపుపై ఉద్యోగ, కార్మిక సంఘాల ఆగ్రహం
- సీఎండీ వార్షిక వేతనం రూ.48.05 లక్షలు
- డైరెక్టర్లకూ అదే స్థాయిలో...
- గత ఏడాది ఆరుగురికి జీతభత్యాల కింద రూ.2.83 కోట్లు చెల్లింపు
- ఉన్నత స్థాయిలో ఉన్నవారు రూ.లక్షల్లో తీసుకుంటూ కార్మికులను ఇబ్బందిపెట్టడమేమిటనే ప్రశ్నలు
- ముందు వారు స్వచ్ఛందంగా తమ జీతభత్యాలు వదులుకోవాలని డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ద్వంద్వ నీతిని పాటిస్తోంది. యాజమాన్య ప్రతినిధులకు జీతభత్యాలుగా లక్షల రూపాయలు ఇస్తూ...ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చే కొద్దిపాటి మొత్తాలను త్యాగం చేయాలని కోరుతోంది. ప్లాంటు ఆర్థిక పరిస్థితి దిగజారిపోయినందున కార్మికులు, ఉద్యోగులు వారి వేతనంలో ఎంతో కొంత స్వచ్ఛందంగా వదులుకోవాలని యాజమాన్యం పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిని వారంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన స్టీల్‌ప్లాంటులో పనిచేస్తున్నా ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని దుస్థితి వచ్చిందని, దీనివల్ల బ్యాంకులు డిఫాల్టర్లుగా ముద్రవేసి రుణాలు కూడా ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. తమకు అరకొరగా ఇచ్చే అలవెన్సులు వదులుకోవాలని చెబుతున్న యాజమాన్యం ప్రతినిధులు లక్షల రూపాయల్లో అలవెన్సులు ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది న్యాయమేనా?... వారు ప్రశ్నిస్తున్నారు.



మూతపడిన బ్లాస్ట్ ఫర్నేస్-3ని తెరిపిస్తానని, పూర్తి సామర్థ్యంతో పనిచేయిస్తానని సీఎండీగా బాధ్యతలు చేపట్టిన అతుల్ భట్..జిందాల్, టాటా స్టీల్ ఇచ్చిన రూ.2,300 కోట్లను ఎందుకు సద్వినియోగం చేయలేదో వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వచ్చిన నిధులు వచ్చినట్టు ఖర్చు చేస్తూ ముడి పదార్థాలు లేకుండా చేస్తున్నారని, దాంతో ఉత్పత్తి దారుణంగా పడిపోయిందని, దానిపై ఎందుకు దృష్టి పెట్టరని ప్రశ్నిస్తున్నారు.

సీఎండీ జీతభత్యాలు రూ.48.05 లక్షలు

ప్రస్తుతం స్టీల్‌ప్లాంటు సీఎండీగా వ్యవహరిస్తున్న అతుల్‌భట్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో బేసిక్ పే కింద రూ.12,87,639 తీసుకోగా, అలవెన్సుల కింద అంతకు మూడింతలు అంటే రూ.35.17 లక్షలు తీసుకున్నారు. ఆ ఏడాదిలో ఆయన డ్రా చేసిన మొత్తం రూ.48.05 లక్షలు. ఆ ఏడాది డైరెక్టర్లుగా వీవీ వేణుగోపాలరావు రూ.44.82 లక్షలు, డీకే మెహంతి రూ.52.73 లక్షలు, కేకే ఘోష్ రూ.76.44 లక్షలు, ఏకే సక్సేనా రూ.53.33 లక్షలు, ఏకే బాగ్చి రూ.7.15 లక్షలు డ్రా చేశారు. ఈ ఆరుగురికి కలిపి రూ.2.83 కోట్లు జీతభత్యాల కింద ఇచ్చారు. వీరు కాకుండా స్టీల్‌ప్లాంటుకు ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో

బంద్‌తో నిలిచిన డిగ్రీ పరీక్షలు 11న నిర్వహణ

- షెడ్యూల్ విడుదల చేసిన ఏయూ అధికారులు

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల బంద్ నేపథ్యంలో వాయిదాపడిన డిగ్రీ పరీక్షను ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు ఆంధ్ర విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టీ.చిట్టిబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల నాలుగో తేదీన బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్‌ఎం విద్యార్థులకు రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే, నీట్‌లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆరోజు బంద్‌కు పిలుపు నిచ్చాయి. దాంతో ఏయూ అధికారులు పరీక్షలను వాయిదా వేశారు. ఆ రెండు పరీక్షలను 11న నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ పరీక్షను 11న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెమిస్టర్ పరీక్షను అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



రథోత్సవాల సందర్భంగా టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో కొలువుదీరిన జగన్నాథుడు మంగళవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామునే అర్చకులు స్వామికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బలభద్ర, సుభద్ర సమేతుడైన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. బుధవారం వరాహావతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. - పూర్ణామార్కెట్

టీటీ క్రీడాకారుడు శర్మకు అభినందన



శర్మను అభినందిస్తున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 9: టేబుల్ టెన్నిస్ క్రీడలో ప్రతిభ చూపుతున్న ఎల్ఐసీ ఉద్యోగ క్రీడాకారుడు డాక్టర్ డీవీఎస్వై శర్మను ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ మంగళవారం తన ఛాంబర్‌లో అభినందించారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో జరిగిన సూపర్ సీనియర్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో 50 ప్లస్ ఏళ్ల కేటగిరిలో ఎల్ఐసీ నుంచి ప్రాతినిధ్యం వహించిన శర్మ... రాణించి రజత పతకం సాధించాడు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ స్పోర్ట్సు కార్యదర్శి బి. శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఊర్వశి జంక్షన్ డీమార్ట్ వద్ద వాహనాల రద్దీ



హైవేపై పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

డీ మార్ట్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే..

- రోడ్డుపైనే మార్ట్‌కు వచ్చే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్
- రాంగ్ రూట్‌లో రాకపోకలతో ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్‌పోలీసులు

కంచరపాలెం, జూలై 9: కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద నూతనంగా ప్రారంభించిన డీమార్ట్ మాల్‌కు వచ్చే కొనుగోలుదారులతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ జంక్షన్‌లో జాతీయ రహదారిని ఆనుకుని డీమార్టును ఏర్పాటు చేయడంతో వాహనాలు లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకుంటోంది. ఇరుకైన రోడ్డు...ఆపై సిగ్నల్ పాయింట్ కావడంతో నిరంతరం రద్దీగా ఉంటోంది. షాపింగ్ కోసం వచ్చేవారు వాహనాలు ఇక్కడే నిలుపుతూలోపలకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయం,సాయంత్రం వేళల్లో కొనుగోలుదారులతో రద్దీగా మారడంతో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా నెలకొంటోంది. సమీపంలో ట్రాఫిక్ బీట్ ఉన్నా చూసీచూడనట్టే వ్యవహరిస్తుండడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మాల్‌కు వచ్చే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను జాతీయరహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు దృష్టిని సారించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, జూలై 9: దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీసమేతంగా మంగళవారం తిరుమల కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం బ్రేక్ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి పద్మజ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

32వ వార్డులో పర్యటన

జ్ఞానాపురం, జూలై 9: 32వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జోన్-4 జోనల్ కమిషనర్ పీవీడీ ప్రసాద్, జనసేన నాయకులు, కార్పొరేటర్ కందుల నాగరాజు మంగళవారం పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని పలువురు కోరారు.

పలు రైళ్ల గమ్యాల కుదింపు, రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 9: శ్రీకాకుళం జిల్లా పూండి-నౌపడ మధ్య భద్రత ఆధునీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్ల గమ్యాలను కుదించగా, మరికొన్ని రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ, పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్ల ఈనెల 11, 13వ తేదీల్లో విశాఖ, శ్రీకాకుళం మధ్య రాకపోకలు సాగిస్తాయని, శ్రీకాకుళం-పలాస మధ్య రాకపోకలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఇక ఒరిజినేటింగ్ రైళ్ల రీ షెడ్యూల్‌కు సంబంధించి భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12830) ఈనెల 11న 45 నిమిషాలు ఆలస్యంగా, భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879) ఈనెల 13న 45 నిమిషాలు ఆలస్యంగా, బయలుదేరుతుందని తెలిపారు. అలాగే, బిలాస్‌పూర్ డివిజన్‌లో ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో విశాఖ, కోర్బా మధ్య రాకపోకలు సాగించే 18518, 18517 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు విశాఖ- బిలాస్‌పూర్ మధ్య నడుస్తాయని, బిలాస్‌పూర్- కోర్బా మధ్య రాకపోకలు రద్దు చేసినట్టు వివరించారు.

అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట, జూలై 9: భీమ్‌నగర్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ జరుగుతున్న పీఎంఎస్ఎంఎ కార్యక్రమం, మాతా శిశు ఆరోగ్య సేవలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలైన అడల్ట్ బీసీజీ వాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్స్ గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలని కోరారు. వైద్యాధికారులకు సాధారణ ప్రసవాలు జరిపేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు. ప్రధానంగా స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షాకాలమైనందున కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, నాగభూషణం, ఎంపీహెచ్ఈవో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అతిసార వ్యాధి ప్రబలకుండా చూడాలి

పూర్ణామార్కెట్: అతిసార వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ సహాయ వైద్యాధికారి కిశోర్ సూచించారు. మంగళవారం 36 వార్డు పరిధిలో ఆశిపాపవీధిలో స్వయం సహాయ సంఘాల నేతృత్వంలో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. సురక్షిత నీటిని తాగాలని, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్నారులు అతిసారం వ్యాధిని బారిన పడకుండా విటమిన్ ఏ సిరప్ తాగించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, మహిళలు ఇంటింటికి వెళ్లి పిల్ల ఆరోగ్యంపైఅవగాహన కలిగించారు. శానిటేషన్ సిబ్బంది తడి, పొడి చెత్త సేకరణలో అవగాహన పెంపొందించుకోవాలని ఏఎంహెచ్‌ఓ కిశోర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి చెత్త ఉంచకుండా శుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆ చెత్తను డస్ట్‌బిన్లలో వేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



36 వార్డులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

అతిసారం నుంచి పిల్లలను రక్షించుకోవాలి

అక్కయ్యపాలెం: అతిసారం వ్యాధి నుంచి పిల్లలను రక్షించుకోవాలని 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు సూచించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో అతిసారం వ్యాధులపై అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేత భరణికాన రాజు

నేను బడికి పోతా.. ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, జూలై 9 : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలంతా పాఠశాలలో తప్పనిసరిగా చేరాలని ప్రచారం చేశారు. హెచ్ఎం పద్మజ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ ఏడాది 1 నుంచి 5వ తరగతి వరకు 233 మంది చదువుతున్నారన్నారు. మరింత మందిని చేర్చుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పందిరి పంటల సాగుతో లాభాలు



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి సోని

అక్కయ్యపాలెం, జూలై 9 : ఎటువంటి అవాంతరాల లేకుండా పందిరి సాగు పంటలతో లాభసాటిగా ఉంటాయని ఉద్యానవన శాఖాధికారి సోని అన్నారు. నరసింహనగర్ రైతుబజారులో రైతులకు మంగళవారం ఉద్యానవన పంటల సాగు, పందిరి వ్యవసాయం విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిందు సేద్యం, పురుగుల మందులు వాడకం, విత్తన శుద్ధి, విత్తనాల కొనుగోలుపై పలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పందిరి వ్యవసాయం చేస్తే వర్షాలు కురిసినా, ఈదురు గాలులు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి త్రినాధ్, రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానాంజనేయునికి ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్: జైల్‌రోడ్డు దరి శ్రీ ధ్యానాంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గోపాజ్యోశ్యుల సత్య జగన్నాథశర్మ ప్రత్యేక అభిషేకాలు, అర్చన, సంకల్ప హారతులు భక్తుల స్వహస్తాలతో జరిపించారు. అనంతరం వారు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీ భరత్‌ను కలిసిన నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 9 : విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వార్డులోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. వారిని కలిసిన వారిలో వార్డు ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్ ఉన్నారు.



ఎంపీకి ఎన్టీఆర్ చిత్రపటమిస్తున్న ఎన్టీఆర్ కళారాధన పీఠం ప్రతినిధులు

ఎన్టీఆర్ కళాపీఠం సత్కారం

జగదాంబ కూడలి: ఎంపీ శ్రీభరత్‌ను ఎన్టీఆర్ కళారాధనపీఠం వ్యవస్థాప అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్ స్వామి, నిర్వాహక అధ్యక్షుడు బంటు అర్జున రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ చిత్రపటం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో సీనియర్ అభిమానులకు పార్టీ పరమైన పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. గండి బాబ్జీ, దక్షిణ నియోజవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌లనూ కలిసి సత్కరించారు. ఎన్టీఆర్ సీనియర్ అభిమానులు, సభ్యులు పాల్గొన్నారు.

సీతమ్మధార: గండి బాబ్జీని ఆయన కార్యాలయంలో సువ్వాడ రవిశేఖర్, విజయనగరం పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి మర్యాదపూర్వకంగా కలిశారు. నార్త్ నియోజకవర్గంలో తెలుగు దేశం కమిటీపై చర్చించారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్, జూలై 9: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఐఅండ్‌ఏక్యూ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఆర్.మంజుల తెలిపారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలి, విద్య పూర్తయిన తర్వాత ఎలా స్థిరపడాలి అనే అంశాలపై మార్గనిర్దేశం చేసినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్లోరియస్ ఐఏఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంపిటేషన్ ప్రపంచంలోని అభ్యర్థుల కోసం ఒక యాప్‌ను రూపొందించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బి.సంతోషిఅనూష, డి.అరుణ పద్మ, కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అన్న క్యాంటీన్ మరమ్మతులు

మర్రిపాలెం, జూలై 9: గ్రేటర్ 53వ వార్డు మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్‌వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ మరమ్మతు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను మంగళవారం విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలను ఇంజనీరింగ్ విభాగం ఏఈ రత్నాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఎన్నికల్లో హామీ మేరకు త్వరలోనే దినసరి కూలీలు, పేద, బడుగులకు అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నండడంపై శ్రీనివాసరావు హర్షం వ్యక్తంచేశారు.

వినికిడి సమస్యలపై అవగాహన సదస్సు

డాబాగార్డెన్స్, జూలై 9: ప్రతీ ఒక్కరూ చెవి సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ (ఆర్‌సీవీసీ) అధ్యక్షులు శివకుమార్ పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సన్ క్యాంపస్‌లో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆర్‌సీవీసీ యూత్ సర్వీసెస్, ఆర్‌సీవీసీ సన్ ఇంటర్నేషనల్ రోటరాక్ట్ ద్వారా కాక్లియర్ సంయుక్తంగా చెవి ఇంప్లాంట్లు, వినికిడి చికిత్స సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌సీవీసీ అధ్యక్షులు శివకుమార్ నేతృత్వం వహించారు. ఆర్‌సీవీసీ యూత్ సర్వీసెస్ డైరెక్టర్స్ ఆర్‌టీఎస్ ఆశాజాస్తి , ఆర్‌టీఎస్ కరుణ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలను పలు అంశాలపై చైతన్యపరిచేలా ప్రజలకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన త్రినాధరావు, తీవ్రంగా గాయపడిన సన్యాసిరావు

మర్రిపాలెం, జూలై 9: రోడ్డుపై నడిచివెళ్తున్న పాదచారులను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధి జ్యోతినగర్ హైవేలోని డిమార్ట్ వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. మాధవధార కళింగనగర్‌లోని సాయిరాం నగర్‌కు చెందిన జొన్నాడ సన్యాసిరావు (38) ఆటోలో బిల్డింగ్ మెటీరియల్ సప్లై చేస్తుంటాడు. అలాగే, పట్టాభిరెడ్డితోటలో ఉంటున్న ఎలమంచిలి త్రినాధరావు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరూ కలిసి మంగళవారం రాత్రి 7:30 సమయంలో డిమార్ట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా కంచరపాలెంవైపు నుంచి బైక్‌తో వేగంగా వస్తున్న యువకుడు క్రాంతి బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు.కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రగాయాలైన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ త్రినాధరావు మృతి చెందాడు. సన్యాసిరావు కోమాలోకి వెళ్లిపోయాడు. అతనిని 108లో కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు త్రినాధరావుకు భార్య కొండమ్మ, డిప్లొమా చదువుతున్న ఉదయ్‌కిరణ్, 8వ తరగతి చదువుతున్న మోహన్‌సాయి ఉన్నారు. సన్యాసిరావుకు భార్య, డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదానికి మితిమీరిన వేగం కారణంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నమోదు చేశారు.

కనకమహాలక్ష్మికి పద్మారాధన పూజలు

పూర్ణామార్కెట్, జూలై 9: వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో మంగళవారం అమ్మవారికి అష్టదళ పద్మారాధన, స్వర్ణ పుష్పాలంకరణ సేవలతో ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలు కట్టారు. ఆలయంఈవో శ్రీనివాసుల రెడ్డి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

వారాహి అమ్మవారికి భక్తుల పూజలు

అక్కయ్యపాలెం: లలితానగర్‌లోని లలితాపీఠంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా నాల్గో రోజు మంగళవారం రాత్రి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

విద్యుత్ తీగల పునరుద్ధరణ



విద్యుత్ పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

జ్ఞానాపురం, జూలై 9: జ్ఞానాపురం వాసులకు కరెంటు కష్టాలు తీరనున్నాయి. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ తీగలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యేకు ఇబ్బందులను వివరించినా పట్టించుకోలేదు. ఈస్థితిలో నూతనంగా ఎన్నికైన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతిమదుబాబు ఇటీవల సమస్యను వివరించారు. స్పందించి ఆయన విద్యుత్ ఏఈ వీర్రాజుతో మాట్లాడారు. ఈమేరకు మంగళవారం నుంచి విద్యుత్ తీగల పునరుద్ధరణ పనులను విద్యుత్ శాఖ సిబ్బంది ప్రారంభించారు. ఈపనులను టీడీపీ వార్డు అధ్యక్షుడు ఐతిమదుబాబు,నాయకులు ఐతిరవిబాబు, దుక్కా ప్రసాద్, సబ్బవరపు శ్రీదర్, గోవింద్ పరిశీలించారు. బుధవారం డయాస్ వీధిలో పనులుజరగనున్నందున విద్యుత్ అంతరాయముంటుందని ఏఈ తెలిపారు.

టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్ షెల్టర్

జగదాంబ కూడలి,జూలై 9: టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'బస్‌షెల్టర్ కనుమరుగు' శీర్షిక కథనం ప్రచురితమైన విషయంతెలిసిందే. దీంతో జోన్ 4 ఇంజినీరింగ్ అధికారులు, బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సీఎం రాక రేపు

... 5వ పేజీ తరువాయి

సదస్సులో పాల్గొంటారన్నారు. ఆ తరువాత 4.30 గంటల వరకు మెడ్‌టెక్ జోన్ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని, అది ముగిసిన తరువాత అక్కడ కొత్తగా నిర్మించిన రెండు తయారీ యూనిట్లను ప్రారంభిస్తారని వివరించారు. ఆపై విమానాశ్రయానికి చేరుకొని అక్కడ లాంజ్‌లో విశాఖ నగరంలో మౌలిక వసతులు, మెట్రో రైలు ప్రాజెక్టు, ఎన్‌హెచ్ఏఐ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ తదితర సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్ఓ మోహన్‌కుమార్, ఆర్‌డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగదీశ్వరరావు, ఆర్ అండ్ బీ, ఈపీడీసీఎల్ ఎస్ఈలు, జెడ్పీ సీఈఓ, మెడ్‌టెక్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల కోడ్ కొంచెం ఆలస్యమైతే టీడీఆర్ జారీ ప్రక్రియ పూర్తయిపోయేది. అలాగే మధురవాడ సర్వే నంబర్ 411,412,419లోని 97.3 ఎకరాల్లో ఎన్‌సీసీ భూములకు సంబంధించి భూవినియోగ స్వభావం మార్పిడి, నాలా చెల్లింపు, ఖాళీ స్థలాల పన్ను, ఆ భూమిలో వాటర్ బాడీలకు సంబంధించిన అభ్యంతరాలు నివృత్తి వంటివన్నీ పెండింగ్‌లో ఉన్నప్పటికీ విల్లాల నిర్మాణానికి అనుమతి కోసం ప్లాన్ పెడితే తిరస్కరించాల్సిన కమిషనర్ కావాలనే దాన్ని డీమ్డ్ టుబీ అప్రూవల్(నిద్రావస్థ)లోకి నెట్టేసి, నిర్మాణాలకు పరోక్షంగా సహకరించారని టీడీపీ, జనసేన నేతలు తాజాగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆ ప్రాజెక్టు వెనుక వైసీపీ నేతలు ఉండడంతో సాయికాంత్‌వర్మ పనులను నిలుపుదలచేసే ప్రయత్నం చేయకుండా తన స్వామిభక్తిని చాటుకున్నారనే విమర్శిస్తున్నారు.

డాక్‌యార్డు వంతెన మూసివేత

... 5వ పేజీ తరువాయి

కిలోమీటర్లు వాహనదారులు ప్రయాణించాల్సి ఉంటుంది.

గూడ్స్ రైళ్లు వస్తే ఆగాల్సిందే..

కాగా ఈ మార్గంలో ప్రయాణికులకు గూడ్స్ రైళ్ల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీల నుంచి ముడిసరకులను గూడ్స్ రైళ్ల ద్వారా ఎగుమతులు చేస్తుంటారు. ఈ గూడ్స్ రైళ్లు ఎప్పుడు వస్తాయో ఎవరికీ కచ్చితంగా తెలియదు. అందువల్ల ఆ రైళ్లు వచ్చిన ప్రతిసారి వాహనాల రాకపోకలను నిలిపివేస్తుంటారు.

త్యాగాలు కార్మికులేనా?, మరి డైరెక్టర్లు చేయరా??

... 5వ పేజీ తరువాయి

నామినేట్ చేసిన స్వతంత్ర డైరెక్టర్లు ముగ్గురు ఉన్నారు. వారు బోర్డు సమావేశానికి హాజరైతే రూ.20 వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తారు. ఆ ఆర్థిక సంవత్సరంలో ఒకరు 40 సార్లు, మరో ఇద్దరు 43 సార్లు బోర్డు సమావేశాలకు హాజరు కావడంతో రూ.30.6 లక్షలు ఇచ్చారు. ఇలా కోట్లాది రూపాయలు యాజమాన్య ప్రతినిధులే జీతభత్యాల కింద తీసుకుంటూ నెలకు రూ.40 వేలు కూడా పూర్తిగా రాని కార్మికులు జీతాల నుంచి కొంత మొత్తం త్యాగం చేయాలని కోరడం విడ్డూరంగా ఉందంటున్నారు. ముందు యాజమాన్య ప్రతినిధులు వారి జీతభత్యాలను స్వచ్ఛందంగా వదులుకొని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. రిటైరైన డైరెక్టర్లను కన్సల్టెంట్లుగా కొనసాగించడం వంటి చర్యలకు తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టాలని సూచిస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ప్రజలకు నిరంతరం సేవలందిస్తాం

ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా 79950 95799 నంబర్‌కు ఫోన్ చేయండి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

గాజువాక, జూలై 9: ప్రజలకు ఏ కష్టం వచ్చినా సేవలందించేందుకు 24 గంటల పాటు సిద్ధంగా ఉంటామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వతంత్ర నగర్‌లో మంగళవారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం సేవించడం, జూదం ఆడడం, పేకాట, వ్యభిచారం, ఆడవాళ్లతో అసభ్యకరంగా మాట్లాడడం వంటివి చేస్తే నేరుగా తనకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు. శాంతిభద్రతలను కాపాడేందుకు పలు చర్యలు తీసుకున్నామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 7995095799 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సత్తిబాబు, ఏసీపీ టి.త్రినాథ్, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు

పెందుర్తి రూరల్, జూలై 9: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో నూతనంగా నిర్మించిన వేదమాత గాయత్రీదేవిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. కార్పొరేటర్ ముమ్మన దేముడుతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు గాయత్రీదేవిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కె.రామకృష్ణస్వామి, మల్లిమనుగుల భాస్కరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎర్రయ్య, సంతోశ్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేపాడమ్మ మారువారం పండగ

పెందుర్తి రూరల్, జూలై 9: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పోర్లుపాలెం ప్రజల ఆరాధ్య దేవత వేపాడమ్మ మారు వారం పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

'కార్మిక వర్గంపై దాడులు ఆపాలి'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 9: కార్మిక వర్గంపై దాడులు ఆపాలని సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ప్లాంట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కార్మిక వర్గంపై యాజమాన్యం దాడులకు దిగుతుందని, దీంతో కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని స్థితిలో యాజమాన్యం ఉందన్నారు. యాజమాన్యం అనాలోచిత నిర్ణయం వల్ల ప్లాంట్‌కు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సంస్థ ప్రగతి కోసం కృషి చేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు వైటీ దాసు, శ్రీనివాస రాజు, బాలశౌరి, ముత్యాలనాయుడు, రాజు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు

గోపాలపట్నం, జూలై 9: వృద్ధుడి అదృశ్యంపై గోపాలపట్నం స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సార్వకోట రాజశేఖర్ అనే హోమ్‌గార్డు రాజశేఖర్ భార్య, ఇద్దరు పిల్లలతో కొత్తపాలెం భగత్‌సింగ్ నగర్‌లో నివసిస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు నగరంలోని వెంకటేశ్వరమెట్ట వద్ద ఉంటున్నారు. ఈ నెల ఐదున రాజశేఖర్ తండ్రి వెంకటరమణ (77) కొత్తపాలెంలోని కుమారుడి ఇంటికి వచ్చారు. కాసేపయ్యాక తన తండ్రిని ద్విచక్ర వాహనంపై గోపాలపట్నం బస్టాపు వద్ద దింపి రాజశేఖర్ ఇంటికి వెళ్లిపోయారు. అయితే వెంకటరమణ ఇంటికి రాలేదంటూ రాజశేఖర్ తల్లి ఫోన్‌చేసి చెప్పడంతో ఆయన కోసం రెండు రోజుల పాటు గాలించారు. అయినా వెంటకరమణ ఆచూకీ లభ్యం కాకపోవడంతో తన తండ్రి అదృశ్యమైనట్టు రాజశేఖర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 41, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 48, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 32, క్యారెట్ 30, దొండకాయలు 35, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 54, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	103
ఫారం ధర	--	123
విత్ స్కిన్	--	216
స్కిన్‌లెస్	--	226

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



ఇందిరానగర్‌లో ఓ ఇంటి దిగువ భాగంలో కూలడానికి సిద్ధంగా ఉన్న కొండచరియ



ఐదేళ్ల క్రితం రామకృష్ణానగర్‌లో కూలిన రిటెయినింగ్ వాల్ (ఫైల్)

వానొస్తే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం..

ఏ క్షణాన కొండచరియలు విరిగిపడతాయోనని భయాందోళన చెందుతున్న ప్రజలు

ఏళ్లతరబడి పలుచోట్ల రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణానికి నోచుకోని కొండవాలు ప్రాంతాలు

గోపాలపట్నం, జూలై 9: చినుకు పడితే చాలు ఎక్కడ కొండచరియలు విరిగిపడతాయోనని గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గోపాలపట్నంలోని ఇందిరానగర్, లక్ష్మీనగర్, రామకృష్ణానగర్ ప్రాంతాలు దాదాపుగా కొండ ప్రాంతంలోనే ఉన్నాయి. వేల సంఖ్యలో జనావాసాలు ఉన్న ఆయా ప్రాంతాల్లో కొండచరియలు జారి ప్రమాదాలు జరగకుండా పలుచోట్ల చాలా ఏళ్ల క్రితమే రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణం చేపట్టారు. అయితే మరికొన్నిచోట్ల రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణం జరగకపోవడంతో వర్షాలు కురిసే సమయంలో తరచూ కొండచరియలు జారిపడడం పరిపాటిగా మారింది. గడిచిన దశాబ్దంన్నర కాలంలో చాలాసార్లు కొండచరియలు జారిపడ్డాయి. అలా కొండచరియలు జారిపడిన ఏ ప్రాంతంలో కూడా రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో వానొస్తే చాలు ఆయా ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఐదేళ్లలో ఎక్కడా రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణం లేదాయె..

గడిచిన ఐదేళ్ల కాలంలో కొండవాలు ప్రాంతంలో మూడుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. అయినా అయాచోట్ల రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణం చేపట్టలేదు. కొండచరియలు జారిపడిన సమయంలో ఆయా ప్రాంతాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పరిశీలించి వెళ్లడమే తప్ప రక్షణ గోడల నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. దీంతో ఎప్పుడు వానొచ్చినా కొండచరియలు విరిగిపడతాయోమేనని భయం భయంగా గడుపుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో మరింతగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రిటెయినింగ్ వాల్‌ల నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని కొండవాలు ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పల్లా శ్రీనివాసరావుకు స్వీట్ తినిపిస్తున్న భవన నిర్మాణ కార్మికుడు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఉచిత ఇసుకతో భవన నిర్మాణ రంగానికి ఊపు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 9: ఉచిత ఇసుక పాలసీ వల్ల భవన నిర్మాణ రంగం ఊపందుకుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాత గాజువాక కూడలి వద్ద భవన నిర్మాణ కార్మికులు పల్లాకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంచి నిర్ణయం తీసుకున్నారని, దీనిపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తుందన్నారు. ప్రజలకు మేలు జరిగే నిర్ణయాల పట్ల వైసీపీ నాయకులు హేళన చేయడం మానుకోవాలన్నారు. ఇప్పుడిప్పుడే ఉచిత ఇసుక పాలసీ అందుబాటులోకి వచ్చిందని, దశలవారీగా ప్రజలకు చేరువవుతుందన్నారు. అధికారం చేపట్టిన అనతికాలంలో ప్రజా సంక్షేమ పథకాలను తాము అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి విషయంలో పరుగులు పెట్టించేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారని పల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, నాయకుడు నల్లూరి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

మల్కాపురం: ఉచిత ఇసుక వల్ల పేదలతో పాటు భవన నిర్మాణ రంగానికి ఎంతో మేలు చేకూరుతుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. శ్రీహరిపురంలోని భవన నిర్మాణ కార్మికుల భవనం వద్ద మంగళవారం ఉచిత ఇసుకను అమలులోకి తెచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి గణబాబు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ రంగం కుదేలైందని, తద్వారా ఎంతోమంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్ల నిర్మానాలకు ఉచితంగా ఇసుకను అందజేస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికులందరికీ కూటమి ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల హక్కులను అమలు చేస్తూ వారిని ఆదుకుంటుందని గణబాబు అన్నారు. త్వరలోనే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించడం జరుగుతుందని, తద్వారా నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు కోరాడ శ్రీనివాసరావు, పొత్తబత్తుల శ్రీను, భవన నిర్మాణ కార్మికరంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ కూడలిలో..

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్ఏడీ కొత్త రోడ్డు కూడలిలో ఉచిత ఇసుక పాలసీ పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ చంద్రబాబు చిత్రపటానికి భవన నిర్మాణ కార్మికులు, టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఇసుక అక్రమాల కారణంగా భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఇప్పుడు భవన నిర్మాణ పనులు జోరందుకుంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నరవ అనూష, ప్రసాద్, మున్నా, నరవ పైడిరాజు, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

పెదగంట్యాడ, జూలై 9: స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్టీల్‌ప్లాంట్ బాలచెరువు గేటువద్ద ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం చేసిన అనాలోచిత నిర్ణయాల వల్లే ఉక్కు కర్మాగార పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మండిపడ్డారు. పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడిపితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. లేకుంటే ఉక్కు కర్మాగారాన్ని తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కర్మాగారం పరిస్థితి రోజురోజుకు దిగజారుతుందని, ముడిసరకు లేకపోవడంవల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. ఉక్కు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మసేన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పోరాట కమిటీ నాయకులు ఎస్ఎస్ రావు, డొక్కా నర సింగరావు, కె.రాజబాబు, వైటీ దాస్, రామస్వామి, డి.అప్పారావు, పైడిరాజు, కారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

1,344వ రోజుకు చేరిన దీక్షలు

కూర్మన్నపాలెం: ఉత్తరాంధ్రకు కల్పతరువైన స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయాలన్న దుర్బుద్ధి కేంద్ర ప్రభుత్వానికి కలగడం అవివేకమని ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,344వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన ప్రభుత్వాలే కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడడం భావ్యం కాదన్నారు. నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ పోరాటాలతో స్టీల్‌ప్లాంటును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని 'పల్లా'కు వినతి

కూర్మన్నపాలెం, జూలై 9: మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆర్కే బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘం నాయకులు మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కణితిలో వినతిపత్రం అందజేశారు. ముందుగా సంఘం సభ్యులు పల్లాకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు ఉమ్మడి ఏపీ ప్రజల కోసం రోశయ్య చేసిన సేవలను వివరించి, తీరంలో ఆయన విగ్రహాన్ని అధికారికంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు బి.కృష్ణారావు, సభ్యులు కారుమూరి మహేష్, గోవింద్, వెంకటరావు, సాయి, గుప్తా, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని..

అక్కిరెడ్డిపాలెం: హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌కు కేటాయించిన స్థలంలో దానిని నిర్మించి దళిత నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు హరిజన జగ్గయ్యపాలేనికి చెందిన పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసిన నాయకులు పలు సమస్యలతో వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. కాలనీకి ఆనుకుని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, అందువల్ల షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని కోరారు. అలాగే కాలనీలో నిర్మించిన కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీ హాల్‌ను పునర్నిర్మించాలన్నారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు వంగలపూడి గోపి, రామాంజనేయులు, నరసింగరావు, బుజ్జిబాబు, టీడీపీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు, తదితరులు ఉన్నారు.



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా ముగిసిన దుర్గాలమ్మ పండగ

మల్కాపురం, జూలై 9: మల్కాపురం దైవదేవ జాలర్ల కుల సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న దుర్గాలమ్మ పండగ మంగళవారంతో ముగిసింది. ఇందులో భాగంగా అమ్మవారిని మల్కాపురం పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించగా, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం, రాత్రి అన్న సమారాధనను చేపట్టారు.

కోలాటం బృందానికి సౌండ్ సిస్టమ్ వితరణ

అగనంపూడి, జూలై 9: పెదముషిడివాడ శివారు విజయరాంపురంలోని దుర్గా పైడిమాంబ కోలాటం బృందానికి గండివానిపాలేనికి చెందిన జనసేన నాయకుడు కరణం నరసింగరావు రూ.పదమూడు వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే కోలాటాన్ని అందరూ ఆదరించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కళాజాత

అక్కిరెడ్డిపాలెం, జూలై 9: నాతయ్యపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కళాజాత స్థానికులను ఆకట్టుకుంది. కళాజాతలో బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నృత్యరూపకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ రుక్సానా బేగం, వి.అమ్మాజీ, పి.భారతి, వి.కుమారి, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీడీఈవో సువర్ణ, తదితరులు

విద్యా ప్రమాణాలపై శ్రద్ధ చూపాలి

డిప్యూటీ డీఈవో కె.సువర్ణ

వేపగుంట, జూలై 9: నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు వసతులు, విద్యా ప్రమాణాల పెంపుపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యంత శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఈవో కె.సువర్ణ ఆదేశించారు. వేపగుంట హైస్కూల్‌లో పెందుర్తి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో స్కూళ్ల నిర్వహణ, వసతులు, విద్యా ప్రమాణాల పెంపుపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల హాజరును నిర్దేశిత సమయానికి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారు బాగా చదివేలా చూడాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. నిజాం ఫిజియోథెరపీ హెల్త్ కేర్ డాక్టర్ కె.రమేశ్ ఆరోగ్యం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరనించారు. ముఖ్యంగా సెల్ ఫోన్ వాడకానికి విద్యార్థులు దూరంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 టి.మధుమూర్తి, మిడ్‌డే మీల్ కో-ఆర్డినేటర్ జేఎస్ శాస్త్రి, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, కె.జయలక్ష్మి, ఎమ్మార్పీ, సీఆర్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో ఏడీసీ పర్యటన



మల్కాపురం మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

మల్కాపురం, జూలై 9: గ్రేటర్ 61వ వార్డు పరిధి మల్కాపురంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్, జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మంగళవారం పర్యటించారు. మల్కాపురం మార్కెట్‌లో పర్యటించి పరిసర ప్రాంతాలు అధ్వానంగా ఉండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. మార్కెట్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఏడీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం పలు వీధుల్లో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని పలువురు కోరారు. చెత్తాచెదారం పేరుకుపోతే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందువల్ల అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఏడీసీ సూచించారు. ఆయన వెంట పలు విభాగాల అధికారులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్

కూర్మన్నపాలెం, జూలై 9: తాగునీరు, ఆహారం కలుషితమైతే అతిసార బారినపడే అవకాశం ఉందని, అందరూ తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. కణితి పీహెచ్‌సీలో మంగళవారం సీజనల్, అతిసారపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు వేడిగా ఉండే ఆహారాన్ని అందించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగించాలని, అందరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం పలువురు చిన్నారుల తల్లిదండ్రులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివయ్య సీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.బాబీ, గోపి, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన ర్యాలీ

గాజువాక: ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని టీడీపీ 74వ వార్డు ఇన్‌చార్జి వియ్యపు కొండబాబు అన్నారు. వార్డు పరిధిలోని నెహ్రూనగర్‌లో అతిసార నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార బారిన చిన్నారులు పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి



బలభద్ర, సుభద్ర సమేతంగా వరాహావతారంలో జగన్నాథస్వామి

అగనంపూడి, జూలై 9: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఇక్కడి జగన్నాథస్వామి మంగళవారం వరహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథునికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు మహిళలు విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించారు. వినాయక భజన మండలిసభ్యులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ మేనేజర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం కాలనీలో..

పెందుర్తి రూరల్: రథోత్సవంలో భాగంగా మండలంలోని చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని గీతా మందిరంలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి పూజలు చేశారు. స్వామివారు ఆదివరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం సురేశ్‌కుమార్ ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

గాజువాక, జూలై 9: మత్తు పదార్థాల విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని న్యూపోర్టు ఎస్ఐ శ్యామ్‌సుందర్ అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రతిభ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. అందువల్ల అందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు సేవించి ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన టీడీపీ నాయకులు

అగనంపూడి, జూలై 9: కుటుంబ కలహాల నేపథ్యంలో హత్యకు గురైన దాడి సూర్యకిరణ్ భార్య మేఘనను మంగళవారం అగనంపూడి ఆస్పత్రిలో టీడీపీ స్థానిక నాయకులు పరామర్శించారు. ప్రేమ వివాహం చేసుకున్న మేఘన ఈ నెల 30న ఆడబిడ్డకు జన్మించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఆమెను వారు కలిసి ధైర్యం చెప్పారు. ఇదిలావుండగా మేఘన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లేంత వరకు రక్షణ కల్పిస్తామని ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.సత్యనారాయణ, కసిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



రథోత్సవాల సందర్భంగా టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో కొలువుదీరిన జగన్నాథుడు మంగళవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామునే అర్చకులు స్వామికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బలభద్ర, సుభద్ర సమేతుడైన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. బుధవారం వరాహావతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. - పూర్ణామార్కెట్

టీటీ క్రీడాకారుడు శర్మకు అభినందన



శర్మను అభినందిస్తున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 9: టేబుల్ టెన్నిస్ క్రీడలో ప్రతిభ చూపుతున్న ఎల్ఐసీ ఉద్యోగ క్రీడాకారుడు డాక్టర్ డీవీఎస్‌వై శర్మను ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ మంగళవారం తన ఛాంబర్‌లో అభినందించారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో జరిగిన సూపర్ సీనియర్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో 50 ప్లస్ ఏళ్ల కేటగిరిలో ఎల్ఐసీ నుంచి ప్రాతినిధ్యం వహించిన శర్మ... రాణించి రజత పతకం సాధించాడు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ స్పోర్ట్సు కార్యదర్శి బి. శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఊర్వశి జంక్షన్ డీమార్ట్ వద్ద వాహనాల రద్దీ



హైవేపై పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

డీ మార్ట్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే..

- రోడ్డుపైనే మార్ట్‌కు వచ్చే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్
- రాంగ్ రూట్‌లో రాకపోకలతో ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్‌పోలీసులు

కంచరపాలెం, జూలై 9: కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద నూతనంగా ప్రారంభించిన డీమార్ట్ మాల్‌కు వచ్చే కొనుగోలుదారులతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ జంక్షన్‌లో జాతీయ రహదారిని ఆనుకుని డీమార్టును ఏర్పాటు చేయడంతో వాహనాలు లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకుంటోంది. ఇరుకైన రోడ్డు...ఆపై సిగ్నల్ పాయింట్ కావడంతో నిరంతరం రద్దీగా ఉంటోంది. షాపింగ్ కోసం వచ్చేవారు వాహనాలు ఇక్కడే నిలుపుతూలోపలకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయం,సాయంత్రం వేళల్లో కొనుగోలుదారులతో రద్దీగా మారడంతో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా నెలకొంటోంది. సమీపంలో ట్రాఫిక్ బీట్ ఉన్నా చూసీచూడనట్టే వ్యవహరిస్తుండడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మాల్‌కు వచ్చే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను జాతీయర హదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు దృష్టిని సారించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్ , జూలై 9: దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీసమేతంగా మంగళవారం తిరుమల కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం బ్రేక్ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి పద్మజ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

32వ వార్డులో పర్యటన

జ్ఞానాపురం, జూలై 9: 32వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జోన్-4 జోనల్ కమిషనర్ పీవీడీ ప్రసాద్, జనసేన నాయకులు, కార్పొరేటర్ కందుల నాగరాజు మంగళవారం పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని పలువురు కోరారు.

పలు రైళ్ల గమ్యాల కుదింపు, రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 9: శ్రీకాకుళం జిల్లా పూండి-నౌపడ మధ్య భద్రత ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్ల గమ్యాలను కుదించగా, మరికొన్ని రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ, పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్ల ఈనెల 11, 13వ తేదీల్లో విశాఖ, శ్రీకాకుళం మధ్య రాకపోకలు సాగిస్తాయని, శ్రీకాకుళం-పలాస మధ్య రాకపోకలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఇక ఒరిజినేటింగ్ రైళ్ల రీ షెడ్యూల్‌కు సంబంధించి భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12830) ఈనెల 11న 45 నిమిషాలు ఆలస్యంగా, భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879) ఈనెల 13న 45 నిమిషాలు ఆలస్యంగా, బయలుదేరుతుందని తెలిపారు. అలాగే, బిలాస్‌పూర్ డివిజన్‌లో ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో విశాఖ, కోర్బా మధ్య రాకపోకలు సాగించే 18518, 18517 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు విశాఖ- బిలాస్‌పూర్ మధ్య నడుస్తాయని, బిలాస్‌పూర్- కోర్బా మధ్య రాకపోకలు రద్దు చేసినట్టు వివరించారు.

అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట, జూలై 9: భీమ్‌నగర్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ జరుగుతున్న పీఎంఎస్ఎంఎ కార్యక్రమం, మాతా శిశు ఆరోగ్య సేవలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలైన అడల్ట్ బీసీజీ వాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్స్ గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలని కోరారు. వైద్యాధికారులకు సాధారణ ప్రసవాలు జరిపేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు. ప్రధానంగా స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షాకాలమైనందున కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, నాగభూషణం, ఎంపీహెచ్‌ఈవో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అతిసార వ్యాధి ప్రబలకుండా చూడాలి

పూర్ణామార్కెట్: అతిసార వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ సహాయ వైద్యాధికారి కిశోర్ సూచించారు. మంగళవారం 36 వార్డు పరిధిలో ఆశిపావవీధిలో స్వయం సహాయ సంఘాల నేతృత్వంలో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. సురక్షిత నీటిని తాగాలని, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్నారులు అతిసారం వ్యాధిని బారిన పడకుండా విటమిన్ ఏ సిరప్ తాగించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, మహిళలు ఇంటింటికి వెళ్లి పిల్ల ఆరోగ్యంపైఅవగాహన కలిగించారు. శానిటేషన్ సిబ్బంది తడి, పొడి చెత్త సేకరణలో అవగాహన పెంపొందించుకోవాలని ఏఎంహెచ్‌ఓ కిశోర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి చెత్త ఉంచకుండా శుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆ చెత్తను డస్ట్‌బిన్లలో వేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



36 వార్డులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

అతిసారం నుంచి పిల్లలను రక్షించుకోవాలి

అక్కయ్యపాలెం: అతిసారం వ్యాధి నుంచి పిల్లలను రక్షించుకోవాలని 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు సూచించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో అతిసారం వ్యాధులపై అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేత భరణికాన రాజు


నేను బడికి పోతా.. ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, జూలై 9 : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలంతా పాఠశాలలో తప్పనిసరిగా చేరాలని ప్రచారం చేశారు. హెచ్ఎం పద్మజ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ ఏడాది 1 నుంచి 5వ తరగతి వరకు 233 మంది చదువుతున్నారన్నారు. మరింత మందిని చేర్చుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పందిరి పంటల సాగుతో లాభాలు



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి సోని

అక్కయ్యపాలెం, జూలై 9 : ఎటువంటి అవాంతరాల లేకుండా పందిరి సాగు పంటలతో లాభసాటిగా ఉంటాయని ఉద్యానవన శాఖాధికారి సోని అన్నారు. నరసింహనగర్ రైతుబజారులో రైతులకు మంగళవారం ఉద్యానవన పంటల సాగు, పందిరి వ్యవసాయం విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిందు సేద్యం, పురుగుల మందులు వాడకం, విత్తన శుద్ధి, వితనాల కొనుగోలుపై పలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పందిరి వ్యవసాయం చేస్తే వర్షాలు కురిసినా, ఈదురు గాలులు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి త్రినాద్, రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానాంజనేయునికి ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్: జైల్‌రోడ్డు దరి శ్రీ ధ్యానాంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గోపాజ్యోశ్యుల సత్య జగన్నాథశర్మ ప్రత్యేక అభిషేకాలు, అర్చన, సంకల్ప హారతులు భక్తుల స్వహస్తాలతో జరిపించారు. అనంతరం వారు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీ భరత్‌ను కలిసిన నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 9 : విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వార్డులోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. వారిని కలిసిన వారిలో వార్డు ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్ ఉన్నారు.



ఎంపీకి ఎన్టీఆర్ చిత్రపటమిస్తున్న ఎన్టీఆర్ కళారాధన పీఠం ప్రతినిధులు

ఎన్టీఆర్ కళాపీఠం సత్కారం

జగదాంబ కూడలి: ఎంపీ శ్రీభరత్‌ను ఎన్టీఆర్ కళారాధనపీఠం వ్యవస్థాప అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్ స్వామి, నిర్వాహక అధ్యక్షుడు బంటు అర్జున రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ చిత్రపటం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో సీనియర్ అభిమానులకు పార్టీ పరమైన పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. గండి బాబ్జీ, దక్షిణ నియోజవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌లనూ కలిసి సత్కరించారు. ఎన్టీఆర్ సీనియర్ అభిమానులు, సభ్యులు పాల్గొన్నారు.

సీతమ్మధార: గండి బాబ్జీని ఆయన కార్యాలయంలో సువ్వాడ రవిశేఖర్, విజయనగరం పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి మర్యాదపూర్వకంగా కలిశారు. నార్త్ నియోజకవర్గంలో తెలుగు దేశం కమిటీపై చర్చించారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్, జూలై 9: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఐఅండ్‌ఏక్యూ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఆర్.మంజుల తెలిపారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలి, విద్య పూర్తయిన తర్వాత ఎలా స్థిరపడాలి అనే అంశాలపై మార్గనిర్దేశం చేసినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్లోరియస్ ఐఏఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంపిటేషన్ ప్రపంచంలోని అభ్యర్థుల కోసం ఒక యాప్‌ను రూపొందించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బి.సంతోషిఅనూష, డి.అరుణ పద్మ, కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అన్న క్యాంటీన్ మరమ్మతులు

మద్రిపాలెం, జూలై 9: గ్రేటర్ 53వ వార్డు మద్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్‌వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ మరమ్మతు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను మంగళవారం విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలను ఇంజనీరింగ్ విభాగం ఏఈ రత్నాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ము ఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఎన్నికల్లో హామీ మేరకు త్వరలోనే దినసరి కూలీలు, పేద, బడుగులకు అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నండడంపై శ్రీనివాసరావు హర్షం వ్యక్తంచేశారు.

వినికిడి సమస్యలపై అవగాహన సదస్సు

డాబాగార్డెన్స్, జూలై 9: ప్రతీ ఒక్కరూ చెవి సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ (ఆర్‌సీవీసీ) అధ్యక్షులు శివకుమార్ పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సన్ క్యాంపస్‌లో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆర్‌సీవీసీ యూత్ సర్వీసెస్, ఆర్‌సీవీసీ సన్ ఇంటర్నేషనల్ రోటరాక్ట్ ద్వారా కాక్లియర్ సంయుక్తంగా చెవి ఇంప్లాంట్లు, వినికిడి చికిత్స సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌సీవీసీ అధ్యక్షులు శివకుమార్ నేతృత్వం వహించారు. ఆర్‌సీవీసీ యూత్ సర్వీసెస్ డైరెక్టర్స్ ఆర్‌టీఎన్ ఆశాజ్యోతి , ఆర్‌టీఎన్ కరుణ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలను పలు అంశాలపై చైతన్యపరిచేలా ప్రజలకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు





మృతిచెందిన త్రినాధరావు, తీవ్రంగా గాయపడిన సన్యాసిరావు

మద్రిపాలెం, జూలై 9: రోడ్డుపై నడిచివెళ్తున్న పాదచారులను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధి జ్యోతినగర్ హైవేలోని డిమార్ట్ వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. మాధవధార కళింగనగర్‌లోని సాయిరాం నగర్‌కు చెందిన జొన్నాడ సన్యాసిరావు (38) ఆటోలో బిల్డింగ్ మెటీరియల్ సప్లై చేస్తుంటాడు. అలాగే, పట్టాభిరెడ్డితోటలో ఉంటున్న ఎలమంచిలి త్రినాధరావు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరూ కలిసి మంగళవారం రాత్రి 7:30 సమయంలో డిమార్ట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా కంచరపాలెంవైపు నుంచి బైక్‌తో వేగంగా వస్తున్న యువకుడు క్రాంతి బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు.కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రగాయాలైన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ త్రినాధరావు మృతి చెందాడు. సన్యాసిరావు కోమాలోకి వెళ్లిపోయాడు. అతనిని 108లో కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు త్రినాధరావుకు భార్య కొండమ్మ, డిప్లొమా చదువుతున్న ఉదయ్‌కిరణ్, 8వ తరగతి చదువుతున్న మోహన్‌సాయి ఉన్నారు. సన్యాసిరావుకు భార్య, డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదానికి మితిమీరిన వేగం కారణంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నమోదు చేశారు.

కనకమహాలక్ష్మికి పద్మారాధన పూజలు

పూర్ణామార్కెట్, జూలై 9: వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో మంగళవారం అమ్మవారికి అష్టదళ పద్మారాధన, స్వర్ణ పుష్పాలంకరణ సేవలతో ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలు కట్టారు. ఆలయంఈవో శ్రీనివాసుల రెడ్డి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

వారాహి అమ్మవారికి భక్తుల పూజలు

అక్కయ్యపాలెం: లలితానగర్‌లోని లలితాపీఠంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా నాల్గో రోజు మంగళవారం రాత్రి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

విద్యుత్ తీగల పునరుద్ధరణ



విద్యుత్ పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

జ్ఞానాపురం, జూలై 9: జ్ఞానాపురం వాసులకు కరెంటు కష్టాలు తీరనున్నాయి. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ తీగలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యేకు ఇబ్బందులను వివరించినా పట్టించుకోలేదు. ఈస్థితిలో నూతనంగా ఎన్నికైన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతిమదుబాబు ఇటీవల సమస్యను వివరించారు. స్పందించి ఆయన విద్యుత్ ఏఈ వీర్రాజుతో మాట్లాడారు. ఈమేరకు మంగళవారం నుంచి విద్యుత్ తీగల పునరుద్ధరణ పనులను విద్యుత్ శాఖ సిబ్బంది ప్రారంభించారు. ఈపనులను టీడీపీ వార్డు అధ్యక్షుడు ఐతిమదుబాబు,నాయకులు ఐతిరవిబాబు, దుక్కా ప్రసాద్, సబ్బవరపు శ్రీదర్, గోవింద్ పరిశీలించారు. బుధవారం డయాస్ వీధిలో పనులుజరగనున్నందున విద్యుత్ అంతరాయముంటుందని ఏఈ తెలిపారు.

టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్ షెల్టర్

జగదాంబ కూడలి,జూలై 9: టర్నర్ చౌల్ట్రీ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' లో 'బస్‌షెల్టర్ కనుమరుగు' శీర్షిక కథనం ప్రచురితమైన విషయంతెలిసిందే. దీంతో జోన్ 4 ఇంజినీరింగ్ అధికారులు, బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సీఎం రాక రేపు

... 5వ పేజీ తరువాయి

సదస్సులో పాల్గొంటారన్నారు. ఆ తరువాత 4.30 గంటల వరకు మెడ్‌టెక్ జోన్ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని, అది ముగిసిన తరువాత అక్కడ కొత్తగా నిర్మించిన రెండు తయారీ యూనిట్లను ప్రారంభిస్తారని వివరించారు. ఆపై విమానాశ్రయానికి చేరుకొని అక్కడ లాంజ్‌లో విశాఖ నగరంలో మౌలిక వసతులు, మెట్రో రైలు ప్రాజెక్టు, ఎన్‌హెచ్ఏఐ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ తదితర సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ఆర్‌డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగదీశ్వరరావు, ఆర్ అండ్ బీ, ఈపీడీసీఎల్ ఎస్ఈలు, జెడ్పీ సీఈఓ, మెడ్‌టెక్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల కోడ్ కొంచెం ఆలస్యమైతే టీడీఆర్ జారీ ప్రక్రియ పూర్తయిపోయేది. అలాగే మధురవాడ సర్వే నంబర్ 411,412,419లోని 97.3 ఎకరాల్లో ఎన్‌సీసీ భూములకు సంబంధించి భూవినియోగ స్వభావం మార్పిడి, నాలా చెల్లింపు, ఖాళీ స్థలాల పన్ను, ఆ భూమిలో వాటర్ బాడీలకు సంబంధించిన అభ్యంతరాలు నివృత్తి వంటి వన్నీ పెండింగ్‌లో ఉన్నప్పటికీ విల్లాల నిర్మాణానికి అనుమతి కోసం ప్లాన్ పెడితే తిరస్కరించాల్సిన కమిషనర్ కావాలనే దాన్ని డీమ్డ్ టుబీ అప్రూవల్(నిద్రావస్థ)లోకి నెట్టేసి, నిర్మాణాలకు పరోక్షంగా సహకరించారని టీడీపీ, జనసేన నేతలు తాజాగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆ ప్రాజెక్టు వెనుక వైసీపీ నేతలు ఉండడంతో సాయికాంత్‌వర్మ పనులను నిలుపుదలచేసే ప్రయత్నం చేయకుండా తన స్వామిభక్తిని చాటుకున్నారనే విమర్శిస్తున్నారు.

డాక్‌యార్డు వంతెన మూసివేత

... 5వ పేజీ తరువాయి

కిలోమీటర్లు వాహనదారులు ప్రయాణించాల్సి ఉంటుంది.

గూడ్స్ రైళ్లు వస్తే ఆగాల్సిందే..

కాగా ఈ మార్గంలో ప్రయాణికులకు గూడ్స్ రైళ్ల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీల నుంచి ముడిసరకులను గూడ్స్ రైళ్ల ద్వారా ఎగుమతులు చేస్తుంటారు. ఈ గూడ్స్ రైళ్లు ఎప్పుడు వస్తాయో ఎవరికీ కచ్చితంగా తెలియదు. అందువల్ల ఆ రైళ్లు వచ్చిన ప్రతిసారి వాహనాల రాకపోకలను నిలిపివేస్తుంటారు.

త్యాగాలు కార్మికులేనా?, మరి డైరెక్టర్లు చేయరా??

... 5వ పేజీ తరువాయి

నామినేట్ చేసిన స్వతంత్ర డైరెక్టర్లు ముగ్గురు ఉన్నారు. వారు బోర్డు సమావేశానికి హాజరైతే రూ.20 వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తారు. ఆ ఆర్థిక సంవత్సరంలో ఒకరు 40 సార్లు, మరో ఇద్దరు 43 సార్లు బోర్డు సమావేశాలకు హాజరు కావడంతో రూ.30.6 లక్షలు ఇచ్చారు. ఇలా కోట్లాది రూపాయలు యాజమాన్య ప్రతినిధులే జీతభత్యాల కింద తీసుకుంటూ నెలకు రూ.40 వేలు కూడా పూర్తిగా రాని కార్మికులు జీతాల నుంచి కొంత మొత్తం త్యాగం చేయాలని కోరడం విడ్డూరంగా ఉందంటున్నారు. ముందు యాజమాన్య ప్రతినిధులు వారి జీతభత్యాలను స్వచ్ఛందంగా వదులుకొని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. రిటైరైన డైరెక్టర్లను కన్సల్టెంట్లుగా కొనసాగించడం వంటి చర్యలకు తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టాలని సూచిస్తున్నారు.

శరవేగంగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు

» 20న గిరి ప్రదక్షిణ నేపథ్యంలో ముమ్మరంగా నిర్వహణ



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

సింహాచలం, జూలై 9: వరాహలక్ష్మీనృసింహస్వామి వెలసిన సింహగిరి ప్రదక్షిణ ఈనెల 20న జరగనున్న నేపథ్యంలో బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. రేయింబవళ్లు కార్మికులు పనులు నిర్వహిస్తున్నారు. గిరిప్రదక్షిణ ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ హరీంద్రప్రసాద్ ఆదేశించడంతో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తక్షణ చర్యలు తీసుకున్నారు. దీంతో జోన్-8 జెడ్సీ హైమవతి సారథ్యంలో ప్రాజెక్టు ఇంజినీర్లు కాంట్రాక్టర్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. అధిక సంఖ్యలో యంత్రాలను వినియోగించి, పాత గోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు గల రెండు కిలోమీటర్ల పొడవైన సింహాచలం కారిడార్ పనులు ఇరువైపులా జోరుగా సాగుతున్నాయి. దశాబ్దానికి పైగా స్తబ్దుగా ఉండిపోయిన ఈ పనులు దాదాపుగా కొలిక్కి వచ్చాయి. సుమారు 70 శాతం మేరకు హాట్‌మిక్స్ వేసి, రహదారికి సరికొత్త రూపం తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా కారిడార్ పొడవునా అడివివరం గ్రామంలోని పోస్టాఫీసు వీధి, కుమ్మరి వీధి, శిడగం వీధి, పైడి తల్లమ్మ గుడి, గ్రామీణ ఆరోగ్యకేంద్రం, కాపువీధిలో అనేక ప్రాంతాలు, గాంధీనగర్, ఎస్సీ కాలనీ, పాత అడివివరంలోని అనే ప్రాంతాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన కనెక్టివిటీ రోడ్లపై 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ప్రత్యేక దృష్టి సారించారు. ప్లాన్‌లో కనెక్టివిటీ రోడ్లకు ప్రత్యేక ప్రణాళికలు, నిధులు మంజూరు చేయని విషయాన్ని గుర్తించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధుల మంజూరుకు యత్నించారు. ఈ నేపథ్యంలో లింక్ రోడ్ల నిర్మాణం పూర్తిచేసేలా ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రధాన రోడ్డు నిర్మాణంతో పాటు లింక్ రోడ్ల నిర్మాణం సత్వరం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ వివరించారు.

భీమిలిలో ఘనంగా ఆటో డే ఉత్సవాలు

భీమునిపట్నం, జూలై 9: భీమిలి పాతబస్టాండ్‌లో మంగళవారం ఆటో డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వరుణ్ మోటార్స్ సంస్థ ప్రతినిధులు ఆటో డ్రైవర్ సంఘ నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాతబస్టాండ్ నూకాంబికా ఆటో డ్రైవర్ల సంఘం గౌరవాధ్యక్షులు పల్లా శ్రీను, పీతల శ్రీనివాస్‌లు, అధ్యక్షులు వియ్యపు ఎర్రిబాబు, బోర వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ఆటో స్టాండ్ ఏర్పాటు

భీమునిపట్నం: బీచ్‌రోడ్డు డచ్ సిమెట్రీలవద్ద కొత్తగా ఆటో స్టాండ్‌ను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఆయన మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు పల్లా శ్రీను, పీతల శ్రీనివాస్‌రావు, అధ్యక్షులు వియ్యపు ఎర్రిబాబు, కార్యదర్శి బి.వెంకట అప్పారావు, తదితరులుపాల్గొన్నారు.

'జనాభాకు తగిన బస్సు సర్వీసులేవీ?'

సాగర్‌నగర్, జూలై 9: తీర ప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా జనసంఖ్య పెరుగుతోంది. అందుకు తగినస్థాయిలో బస్సు సర్వీసుల కల్పనలో ఆర్టీసీ విఫలమవుతోంది. దీంతో జనాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా తీరప్రాంత గ్రామాల్లో నివాసాలు ఉంటున్నారు. చాలామందికి సొంతవాహనాలు లేవు. దీంతో వీరు ఆర్టీసీ బస్సులపైనే ప్రయాణాలు సాగిస్తున్నారు. లేదా ఆటోలను ఆ శ్రయించాల్సి వస్తోంది. వివిధ పనులు నిమిత్తం తీరప్రాంతాల నుంచి బయటకు, తిరిగి రావాలన్నా ఆర్టీసీ బస్సుల కోసం బస్టాప్‌ల వద్ద వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. 15 ఏళ్ల క్రితం తీరప్రాంత గ్రామాలకు ఐదు సర్వీసులు ఉండేవి. ఈ సర్వీసులు పెంచాల్సింది పోయి మూడుకు పరిమితం చేశారు. మద్దిలపాలెం డిపో మాత్రమే మూడు బస్సు సర్వీసులను నడుపుతోంది. గతంలో 51 బస్సు సర్వీసు సాగర్‌నగర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ , రైల్వేస్టేషన్ మీదుగా సింహాచలంకు నడిచేది. ఈ బస్సు కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగపడేది. అలాగే, 52 ఎస్, 17బీ ఇలా పలు సర్వీసును తొలగించారు. ప్రస్తుతం 52వీ/జీ 3బస్సు సర్వీసులు మాత్రమే ప్రస్తుతం సేవలందిస్తున్నాయి. అరకొర బస్సు సర్వీసులతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. బస్సు సర్వీసులను పెంచి మెరుగైన రవాణా సదుపాయం తీరప్రాంతాలకు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వర్షపు నీటి సమస్య పరిష్కరించాలి

» కొండప్ప చెరువును పరిశీలించిన జెడ్సీ, కార్పొరేటర్



సంగివలస కొండప్ప చెరువును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

తగరపువలస, జూలై 9: జీవీఎంసీ 2వ వార్డు పరిధిలో కొండప్ప చెరువులో ద్వారాలు మూసుకుపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ తగరపువలస సర్వీసు రోడ్డు జలమయమవుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వార్డు కార్పొరేటర్ జి. చిన్నికుమారి లక్ష్మి కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి, అధికారులు, కార్పొరేటర్ లక్ష్మి, టీడీపీ నాయకులు ఈ చెరువును పరిశీలించారు. చెరువు చుట్టూ అభివృద్ధి చేసి దివీస్ సంస్థ పార్కును నిర్మించడంతో వర్షపు నీరు వెళ్లడానికి దారులన్నీ మూసుకునిపోయినట్టు స్థానికులు వివరించారు. దీంతోపాటు సంగివలస, నచ్చివానిపేట, తదితర ప్రాంతాల్లో కాలువలు లేకపోవడంతో వర్షాలు వచ్చిన ప్రతిసారి ఈ నీరంతా తగరపువలస హైవేకు అనుబంధంగా ఉన్న సర్వీసురోడ్డులో నిలిచిపోతోందని వివరించారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, చోడిపల్లి సాయి, జనసేన నాయకులు ఎస్.శంకరరెడ్డి, చిల్ల ఎర్రయ్యరెడ్డి, చేట్ల రమణ, గురుమూర్తి రిక్కసత్యవతి, రామునాయుడు, బసవ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

మధురవాడ, జూలై 9: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ తెలిపారు.మధురవాడ వాంబేకాలనీలో మంగళవారం మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూపై అ ప్రమత్తంగా ఉండాలని కోరారు. జీవీఎంసీ సిబ్బంది దోమల నియంత్రణకు మందులు చల్లాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్యసిబ్బందికి అందించాలని కోరారు. ఈ ర్యాలీలో కార్యదర్శి పిళ్లా వెంకటరావు, రాము, భవాని, కాంతమ్మ, లావణ్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



21వ వార్డులో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ మంగమ్మ తదితరులు

పెదవాల్తేరు: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని 21వ వార్డు టీడీపీ నేత పీతల అవినాష్ పిలుపునిచ్చారు. చినవాల్తేరు సీఎం ఆరోగ్య కేంద్రం తదితర ప్రాంతాలలో నిర్వహించిన అవగాహన ర్యాలీని పార్టీ వార్డు ఇన్‌చార్జి పీతల అవినాష్ ప్రారంభించి మాట్లాడుతూ జీవీఎంసీ సిబ్బంది సరఫరా చేసిన డస్ట్‌బిన్లలో తడి, పొడి చెత్తనే వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఆరిలోవ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు అన్నారు. మంగళవారం దయాళపురం శ్మశానవాటిక ఆవరణలో గ్లోబల్ హెల్పింగ్ హ్యాండ్స్ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బుడుమూరు గోవింద్, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనం



ఆరిలోవలో అవగాహన కల్పిస్తున్న సీఐ గోవిందరావు

భీమునిపట్నం, జూలై 9: మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనమవుతుందని, వాటికి దూరంగా ఉండాలని భీమిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నమనాయుడు సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జడ్పీహైస్కూల్‌లో ఎన్‌డీపీఎస్ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం విద్యార్థులకు గంజాయి, హెరాయిన్, కొకైన్ తదితర డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలనువిపులంగా ఆయన వివరించారు. వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.భాను, ఉపాధ్యాయులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిలోవ: గంజాయి, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ గోవిందరావు సూచించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉత్తమంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలని, తద్వారా పాఠశాలలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ బీకే రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భీమిలిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడాలి

» సమగ్ర శిక్ష జీసీడీఓ కల్పన

పద్మనాభం, జూలై 9: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర బాలికా సంరక్షణ అధికారి (జీసీడీఓ) కల్పన శైల సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులు అభ్యసన తీరును పరిశీలించారు. వారిని ఎ, బి. గ్రేడులకు తీసుకువచ్చే విధంగా తీర్చిదిద్దాలన్నారు. వార్షిక క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కిట్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలతో పాటు పాఠశాల ప్రాంగణంలో పెంచిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అప్పలనాయుడు, ఎంఈఓ రమణ, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యర్థుల కిట్లను పరిశీలిస్తున్న జీసీడీవో కల్పన

యూనిఫాం పంపిణీ

భీమునిపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవీఎంసీ 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జీవీఎంసీ 4వ వార్డు టీడీపీ అధ్యక్షులు పాసి నర్సింగరావు కాపులుప్పాడ యూపీ స్కూల్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత యూనిఫారాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో హెచ్ఎం పి.రమణ, టీడీపీ నాయకులు మారోజు సంజీకుమార్, సంకురుభుక్త జోగారావు, బోర బంగారురెడ్డి, శీరపు రమణ, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, నారు ఎల్లాజి, వేముల రమణ, అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న కార్పొరేటర్ గంటా అప్పలకొండ

భీమునిపట్నం (రూరల్): మండలంలోని మజ్జిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, విద్యా సామగ్రిని అందించారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ

విశాలాక్షినగర్: జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని సంజీవ్‌నగర్ కాలనీలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన స్కూల్ కిట్స్‌ని విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, టీడీపీ నాయకులు ఈశ్వరరావు, అప్పారావు, శ్రీమన్నానారాయణ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మత్స్యావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 9: జగన్నాథ రథోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఇంద్రద్యుమ్న మందిరంలో ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల కృష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. సాయంత్రం మత్స్యవతార వైశిష్ట్యంపై సింగరాచార్య ప్రసంగించారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, జూలై 9: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన పుణ్యాహవచనాలు చేసిన తరువాత షోడశోపచరాలు సమర్పించారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో స్వామి, అమ్మవార్లకు కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు కావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న రుషికొండ వాకర్స్

సాగర్‌నగర్, జూలై 9: చిన రుషికొండ ఓడపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి రుషికొండ వాకర్స్ కుర్చీలను, పిల్లలు ఆడుకోవడానికి బొమ్మలను మంగళవారం వితరణగా అందజేశారు. ప్రముఖ సంఘసేవకులు బొత్స జగదీశ్వరరావు సహకారంతో వీటిని పంపిణీ చేశారు. సామాజిక సేవలో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వాకర్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిదాసు, జి.దానయ్య, గద్దిపల్లి అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 41, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 48, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 32, క్యారెట్ 30, దొండకాయలు 35, బంగాళదుంపలు 32, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 100, అల్లం 140, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 32, కీర దోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	103
ఫారం ధర	--	123
విత్ స్కిన్	--	216
స్కిన్‌లెస్	--	226

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కలిసిన నేతలు



పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న 9వ వార్డు టీడీపీ నాయకులు

విశాలాక్షినగర్, జూలై 9: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుని తూర్పు నియోజకవర్గం పరిధిలోని 9వ వార్డు నాయకులు వేజేళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వార్డులోని పార్టీ మరింత బలోపేతానికి చేపడుతున్న పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, అన్నెరాజా, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులను కించపరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి



సీపీని కలిసిన బ్రాహ్మణ సంఘం సభ్యులు

కొమ్మాది, జూలై 9: బ్రాహ్మణులను కించపరుస్తూ ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరంలోని బ్రాహ్మణ సంఘాలు మంగళవారం నగర పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి ఫిర్యాదు చేశాయి. ఫైలాదాస్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో బ్రాహ్మణులను, వారి పు ట్టుకలను కించపరుస్తూ కులాల మధ్య చిచ్చుపెట్టేలా విమర్శలు చేసినట్టు వివరించారు. దీనిపై సీపీ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీపీని కలిసిన వారిలో ఏపీ అర్చక పురోహిత సంఘం, విశాఖ బ్రాహ్మణ అర్చక, పురోహిత సంఘం, మధురవాడ బ్రాహ్మణసంఘ సభ్యులున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

పెదవాల్తేరు, జూలై 9: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని జీవీఎంసీ జోన్-3 ప్రజారోగ్య సహాయ వైద్యాధికారి ప్రసాద్ అన్నారు. శానిటరీ సూపర్ వైజర్ బి.సత్యం అధ్యక్షతన మంగళవారం వార్డులో పీహెచ్ వర్కర్లుగా సేవలంది ఉద్యోగ విరమణ చేసిన కోనా సావిత్రి, సోమాదుల రత్నం, కైతేపల్లి రాజులను ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి పారిశుధ్య వృత్తి నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో శానిటరీ కిలాన అప్పారావు, గొడుగు ప్రకాశ్‌రావు, నాయుడు, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి



రెడ్డిపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

పద్మనాభం, జూలై 9: మండల పరిధి రెడ్డిపల్లిలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని వ్యవసాయశాఖ కమిషనరు ఆదేశాల మేరకు విజిలెన్సు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాకు రిజిస్టర్లు, గోదాముల్లో నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా తనిఖీకి వచ్చిన రంపచోడవరం వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్ కెవీ చౌదరి, విజిలెన్ ఎన్‌ఫోర్సుమెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఆర్. రవిప్రసాద్ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల దుకాణాలు నిర్వహించే వారు తప్పనిసరిగా లైసెన్సులు పొంది ఉండాలన్నారు. ప్రతీ కొనుగోలుకు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. పురుగుమందుల ఆయా కంపెనీల నుంచి ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు లేకుంటే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరలకే వి క్రయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ శ్రీకాంత్, పద్మనాభం ఏఓ ఎంవీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎన్ని శ్రీనివాసరావు



డీజీపీకి జ్ఞాపిక అందిస్తున్న శ్రీనివాసరావు

ఆనందపురం, జూలై 9: ఏపీ బీసీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ ఎన్ని శ్రీనివాసరావు డీజీపీ ద్వారక తిరుమలరావును మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీలపై జరిగిన దౌర్జన్యాలు, హత్యలు, ఇతర అకృత్యాలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేశన శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

సిరిపురం, జూలై 9: ట్రాఫిక్ నిబంధనలు, వాటి చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గొల్లలపాలెంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతీ ఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై పిల్లలు తమ తల్లిదండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని కోరారు. మోటారు వాహన చట్టాలపై ఆర్టీఓ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ శ్రీనివాస్, టూ టౌన్ ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జె.రామ్‌కుమార్, ఆర్టీఓ, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఎలమంచిలి ఎమ్మెల్యే



కప్పస్తంభం వద్ద ఎమ్మెల్యే దంపతులు

సింహాచలం, జూలై 9: వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఉదయం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ ఎన్.ఆనందకుమార్ అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని,బేడామండప ప్రదక్షిణల తరువాత అంతరాలయంలో ఎమ్మెల్యే గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

భీమునిపట్నం, జూలై 9: సాంఘిక సంక్షేమ ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 76 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎస్ఎఫ్‌డీ కో కన్వీనరు లొడగల అచ్చిబాబు విద్యార్థి సంఘ పతాకాన్ని ఎగురవేశారు. భాగ్ కన్వీనరు ముద్దాడ వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.